# జ్ఞానంగల కుక్క

సార్వభౌమరావుగారి దగ్గిర ఒక కుక్క ఉండేది. అది అన్నప్పుడల్లా మొరిగేది కాదు. నేరస్థులనూ, జైలుకు పోయివచ్చినవాళ్లనూ చూస్తే మాత్రమే మొరిగేది. చివరకు, ఈ విషయం ఎన్ని డజన్ల సార్లు రుజువయిందంటే, అది ఎవర్ని చూసి మొరిగితే వాళ్లు నేరస్థులయి ఉండాలని అందరూ నమ్మే స్థితికి వచ్చారు.

"అది దైవాంశగల కుక్కేమోనండీ, సార్వభౌమరావుగారూ?" అన్నారు కొందరు. "ఏమో చెప్పలేం!" మనస్తత్వం వాళ్లు.

సార్వభౌమరావు అంతదూరం వెళ్లలేదు గాని, "శాస్త్రజ్ఞానానికి అందని విషయాలు జీవితంలో చాలా ఉన్నాయి" అన్నాడు.

సార్వభౌమరావుగారంటే పదవిలేని ప్రభువు, మకుటంలేని మహారాజు. మంత్రులు కూడా ఆయనతో రాచకార్యాలు జరిపేవారు.

ఒకరోజు ఒక మంత్రి అంతటివాడు సార్వభౌమరావుగారింటికి వచ్చాడు. కుక్కకు ఆయన ముఖం – లేక వాసన – కొత్తకాదు. కాని ఎందుకో ఈసారి కుక్క ఆయన్ను చూడగానే మొరిగింది.

మంత్రిగారి ముఖం ముందు తెల్లగా అయి, తరవాత ఎర్రగా అయింది.

"ఏమిటిది? ఇదేమిటి?" అన్నాడాయన.

"దాని సంగతి నేను చూస్తాను. మీరు పట్టించుకోకండి. మీకు క్షమాపణలు చెప్పుకుంటాను" అని సార్వభౌమరావు కుక్కను ఆ రాత్రి తన పిస్తోలుతో కాల్చి చంపాడు.

ఇటీవల బయటపడింది. ఆ మంత్రిగారు సార్వభౌమరావింటికి వచ్చే ముందు వారం రోజుల క్రితం తన నౌకరు కుర్రాణ్ని చంపి, పోలీసుల చేత అడవిలో నక్సలైట్ శవాల మధ్య పారేయించి, "ఈ నక్సలైట్లు ఇక్కడ ఉండరూ అని చెప్పలేం గద" అని అందరితోనూ అన్నాడు.

ఏమైనా అలా దుర్మార్గాన్ని పసిగట్టగల కుక్కలు – మనుషులు కూడా – పోతేనే మంచిదని ఉన్నత వర్గాలవారి అభిప్రాయం.

***ముద్రణ : యువ, 1947?***